
PRABAKAR

# వాన

“అబ్బ....రాత్రంతా కురిసి పొద్దున్నకి వెలిసి పోవాలి. అప్పుడే హాయిగా ఉంటుంది వాన వచ్చినా” అనుకున్నాను.

వాన కుండపోతగా కురుస్తోంది. ఈ కోస్తా జిల్లాల్లో ఇంతే. శ్రావణమాసం ప్రారంభమయితే చాలు — మబ్బులుపట్టి చినుకులు ప్రారంభమయి పోతాయి. గాలులు విసురుగా వీస్తున్నాయి. చిరాగ్గావుంది. పొద్దున్నేవచ్చిన వాన, పొద్దున్నే దిగబడిన చుట్టం ఓ పట్టాన కదలరట! ఈ వాన తగ్గదుకాబోలు! ఆఫీసుకి టయిమయిపోతుంది.

“ఏమిటి అలాకూర్చున్నారు? వంటయింది, రండి, భోంచేద్దాం. ఆఫీసుకి వెళ్ళొద్దూ మీరు!” అంది సుశీల.

దూరంగా వున్న చెట్టు మీద పక్షులు కిలకిల లాడుతున్నాయి. వాటికి వెచ్చగా వుందేమో కువకువ లాడుతున్నాయి.

వర్షం మూలంగా మార్కెట్‌కి వెళ్ళలేదు నేను. కాబట్టి కూరల్లేవు. మూడు రోజులనాడు కొన్న బంగాళా దుంపలున్నాయి కాబోలు. వేయించింది సుశీల. కందిపప్పు పచ్చడిచేసింది. ఉల్లిపాయ పులుసు. ఓహ్! వర్షం నాడెంత మంచి భోజనం! వేడివేడి అన్నం తింటుంటే ఎంత హాయిగా ఉంది! కానీ మళ్ళీ ఆఫీసుకి వెళ్ళాలని గుర్తొచ్చి కొండంత బాధ కలిగింది.

“ఏమిటా తిండి, కొంచెం కందిపచ్చడి వేస్తున్నాను. కలుపుకోండి” అని మరికొంచెం వేసి నెయ్యి వంచింది గిన్నెలోంచి.

కిటికీలోనించి వాన జల్లు.

“కిటికీ మూసెయ్యనా?”

“ఒద్దొద్దు. అలావుండనీ....బావుంది”

“అయినా పాడువాన. రాత్రంతా కురిసి పగలు మానెయ్యకూడదూ” అంది మెరుస్తున్న కళ్ళతో.

“నిజమే. రాత్రయితే చక్కగా, వెచ్చగా పడుకోవచ్చు కప్పుకుని. ఏం?” అన్నాను చిలిపిగా ఆ కళ్ళల్లోకి చూస్తూ.

“మరే” అంది సిగ్గుపడి సుశీల.

హుషారుగా లేచాను భోజనం ముగించి.

“పగలు వానొస్తే ఇంతే....పని చేటు రంగమ్మ రాలేదు. ఇంక పాత్రలన్నీ తోము కోవాలి” వక్కపలుకు అందిస్తూ అంది సుశీల


వక్కపలుకు అందుకుని వానలోకి నడిచాను.

దారంతా బురద. చితచిత లాడుతోంది. కాలు తీసి కాలెయ్యడం కష్టంగా వుంది. గతుకు రోడ్లవటం మూలాన – అక్కడక్కడ గోతుల్లో నిలిచిన నీళ్ళు. కాలు పడితే చీదరగా వుంది. ఎదురుగాలి అవడం మూలాన గొడుగు చేత్తో పట్టు కోవడం అవస్థగా వుంది. రిక్షాలను, కార్లను, బస్‌లను, తప్పించుకోవడం మరింత యాతనగా ఉంది. ఒక్కొక్క శకటం నీళ్ళు చిందించుకుంటూ వెడుతుంది. అది, ఆ షవర్ తప్పించుకోవడం బలే ఇబ్బంది. ఎంత ఒదిగి నిలబడ్డా అంతే– నీళ్ళు చిమ్మే వెడతాయి ఈ బళ్ళు.

ఆఫీసు చేరేసరికి సరిగ్గా గడియారం పది కొట్టింది. అప్పుడే మెల్లమెల్లగా ఒకరొకరే చేరుకుంటున్నారు. రెయిన్ కోట్ల వాళ్ళు, గొడుగులవాళ్ళు, తడిసి వచ్చిన వాళ్ళు .... ఇలా రకరకాలుగా వచ్చేస్తున్నారు. ‘పాడువాన’ అని కొందరు తిట్టుకుంటే మరికొందరు మెచ్చుకుంటున్నారు.

“వాన లేకపోతే ఎలాగ?” అంటూ వర్షాల మీద, వాటిమీద ఆధారపడే ప్రజలమీద, పంటల మీద ఉపన్యాసాలు దంచేస్తున్నారు కొందరు.

నేను వీటికేమీ ప్రాధాన్యత ఇవ్వకుండా నా సీటులోకి వెళ్ళి కూర్చున్నాను. వాన వచ్చిన రోజు నాకు మాట్లాడ బుద్ధికాదు. ఏవో పనులు, ఉంటే చేసుకోడం, లేకపోతే కిటికీ లోంచి వాన చినుకులు చూడడం సరదా నాకు. ఆఫీసుకొచ్చాం కాబట్టి పని చెయ్యాలి. కబుర్లతో కాలక్షేపం చెయ్యడం నా మతానికి విరుద్ధం. మేనేజరుగారు



ఉమాశశి

పీడిత జనావళికి సేవచేయడమే పరమావధిగా భావించి, తన ఆశయసిద్ధికి అహర్నిశలూ పాటు పడుతున్న మదర్ థెరెసాకు ఇటీవల ప్రసిద్ధ విద్యా సంస్థ విశ్వభారతి (శాంతినికేతన్) అత్యున్నతమైన 'దేశికోత్తమ' గౌరవాన్ని అందజేసింది. శాంతినికేతన్‌లో జరిగిన 'విశ్వభారతి' వార్షిక స్నాతకోత్సవంలో - ఛాన్స్‌లర్ (ఆచార్య) శ్రీమతి ఇందిరా గాంధి - 'దేశికోత్తమ' అవార్డును మదర్ థెరెసాకు అందజేస్తూ - ఆమె కార్యదీక్షను పలు విధాలుగా ప్రశంసించారు.



వచ్చేసరికి అందరూ సీట్లల్లో సర్దుకున్నారు.

ఒక్కొక్క గంట ఒక్కొక్క యుగంలా గడిచినట్లనిపించింది నాకు. ఎంతకీ కాలం గడవడం లేదు. గబగబ మేనేజరుగారు చెప్పిన పనులు చేసేశాను. టైపు చెయ్యమన్నవి టైప్ చేసేసాను. అతి భారంగా అయిదు గంటలు కొట్టింది గడియారం.

వాన ఆగకుండా కురిసినందువల్ల మధ్యాహ్నం కేంటీన్‌కు వెళ్ళలేకపోయాను. అందుకే కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి.

మళ్ళా పొద్దున్నలాగే సర్కస్ చేసుకుంటూ ఇల్లు చేరుకున్నాను. గొడుగు మడవకుండా అల్లాగే వరండాలో నేలకానించి పెట్టాను. అక్కడంతా నీళ్ళు కారుతున్నాయి. గొడుగు కమ్మీలలోంచి వచ్చిన నీరు చిన్న-పిల్ల కాలువలా తయారయింది.

అలాగే కాసేపు చూచి ఏం చెయ్యలేక లోపలికి వచ్చాను. సుశీల ఎదురొచ్చింది కాఫీ కప్పుతో. వట్టి కాఫీ చూసేసరికి నాకు కోపం వచ్చింది. అయినా అణిచి వేసుకున్నాను. పొద్దున్న పని మనిషి కూడా రాలేదు. పాత్రలన్నీ తోముకోడం, గట్రాతో సతమతమయి ఉంటుందనుకుని మాట్లాడ లేదు. అయినా ప్రశ్న నా నోట్లోంచి వచ్చింది.

"పనిమనిషి రాలేదా?"

"ఇప్పుడే వచ్చింది"

"మరి, టిఫెనేం చెయ్యలేదా?"

విసుగుని దాచుకుంటూ అడిగాను. సుశీల కళకళ్ళాడే మొహం చూస్తుంటే ఎందుకో గట్టిగా అడగ బుద్ధికాలేదు.

"మీరు కాఫీ తాగి మొహం కడుక్కోండి. ఒక్క మూడు నిమిషాల్లో ఉప్మా అయిపోతుంది" అంది సుశీల వంటింట్లోకి వెళ్ళిపోతూ.

అందుకే సుశీలంటే నాకు ముచ్చట. ఎల్లాగో నచ్చ చెప్తుంది.

ఓ అరగంట తర్వాత అంతా సర్దుకుంది. బహుశ వానకి అలవాటు పడ్డాననుకుంటాను.

అలా వీధివరండాలోకి వెళ్ళినుంచున్నాను. వాన చినుకులు పెద్ద పెద్దవి ధారగా పడుతున్నాయి. ఆకాశం ఇంకా మబ్బుగానే వుంది.

పొద్దున్న చూడలేదుకానీ, మా వీధికి ఎదురుగా కుడివైపు పది గజాల దూరంలో పూరి పాకలున్నాయి. అవన్నీ చాలావరకు కూలిపోయినట్లున్నాయి....పాపం!

ఆ జనం ఎలా? ఏం చేస్తున్నారు? మా పని మనిషి రంగమ్మ ఇల్లు కూడా అక్కడే. కూలిపోయిన ఆ గుడిసెల దగ్గర ఎవరూ జనం లేరు. అంతా ఎక్కడెక్కడో సర్దుకునేశారుగావును.

"ఇప్పుడే వచ్చింది రంగమ్మ. పాపం వాళ్ళ పూరిళ్ళన్నీ కూలిపోయాయిట" అంది సుశీల నా వెనకనుంచి.

"ఏం చేశారు మరి వాళ్ళు?"

"అదే, దేవాలయం దగ్గర కొందరు; సత్రపు అరుగు మీద కొందరు సర్దుకున్నారట."

అసలే పూరి కొంపలు, జీర్ణావస్థలో వున్నాయి. పైన వర్షం కుండపోతగా, ఆ పైన ఈదురుగాలి. పూరిళ్ళేం నిలుస్తాయి? మరేంచేస్తారు పేదజనం?

పాపం అనుకున్నాను.

అనుకుని ఏం చెయ్యను? ఏం చెయ్యాలి? ఉద్రేకం పొంగుకొస్తోంది. ఊరికే కోపం తెచ్చుకోడం ఎందుకు? ఎవరిమీద?

పేద జనానికి తిండి వుండదు. కట్టుకోడానికి చాలినన్ని దుస్తులుండవు. సరే....కనీసం తల దాచుకోడానికి సరైన పంచ కూడా లేకపోతే ఎలాగ? లక్షలాదిజనం మహా నగరాల్లో పేవ్‌మెంట్లమీదే బ్రతుకుతారు. అక్కడే పుట్టి అక్కడే కన్ను మూసిన వాళ్ళని నేనెరుగుదునంటూ నా స్నేహితుడు ఒకసారి ఉత్తరం కూడా రాశాడు. పాపం! ఏం బ్రతుకులు? వీళ్ళందరికీ అన్నీ సమకూడే రోజెప్పుడో! ఆ రోజు, అలాంటి రోజంటూ వస్తే నేను చూస్తానా?

"రండి, ఉప్మా తయారయింది" అంది సుశీల. లోపలికి వెళ్ళి ఉప్మా పళ్ళెం చేతుల్లోకి తీసుకున్నాను.

"నువ్వు తినవూ?"

"ఇలా మబ్బుగా వుంటే ఆకలెయ్యదు నాకు. మీరు కానివ్వండి" అంది.

"రంగమ్మ, పిల్లలు ఎలా వున్నారట?"

"రాత్రి అవస్థపడ్డారట. ఏం చేస్తాం. అన్నం వుంటే కాస్త పెట్టాను. అది తినే పనిలోకి దిగింది. పిల్లలేం తిన్నారో యేమో! అడిగితే ఏదో గొణిగింది"

నోట్లో ఉప్మా మెల్లగా నానుతూంది. ఆ వాడలోని పిల్లలు నా కళ్ళల్లో మెదిలారు. ఉప్మా మరి నోటికి ఎక్కలేదు. ఆకలనేది అందరికీ ఒకటే కదా!

"అదేం? బాగోలేదా ఉప్మా? హడావుడిగా చేశాను. ఒదిలేశారేం? సరిగ్గా కుదరలేదా?" అంది సుశీల గాభరాగా.

"అహహ....బాగుంది. కానీ ఏమిటో ఆకలి చచ్చిపోయింది. ఈ మబ్బు మూలంగానేమో" అన్నాను.

ఒక్కక్షణం నన్ను చూసింది సుశీల.

"నిజమే. రంగమ్మ పిల్లల్ని, ఆ సంసారాన్ని తల్చుకుంటే నోటికేదీ ఎక్కదు. అలాంటి సంసారాలు బోలెడున్నాయి. అయినా మనం చెయ్యగలిగిందేమిటి? ఉన్న దాంట్లో వాళ్ళకొక్కాస్త పెడతాం. అంతేగా" అంటూ ఆగి మళ్ళీ—

"ఈ కాస్తా తినెయ్యండి. వంటవడానికి కొంచెం ఆలస్యం అవుతుంది. రంగమ్మకి వండుకోడానికి బియ్యం, అవీ నేను ఇస్తాను. ఏదో ఇంత ఉడకేసి పిల్లలకి పెడుతుంది. మధ్య తరగతి వాళ్ళం. ఈ ఉడత సహాయం తప్ప

ఏంచెయ్యగలం చెప్పండి" అంది సుశీల లోపలికి వెడుతూ.

నన్ను తక్కున అర్థం చేసుకుంటుంది సుశీల. రంగమ్మ సంసారం లాంటి బ్రతుకుల గురించి నేనాలోచిస్తున్నానని, అందుకే ఆకలిగా ఉన్నా నేను ఉప్మా తినలేక పోయేంత సున్నితత్వం నాలో వుందని గ్రహించి, ఆ మాట అంది.

కిటికీ దగ్గర నుంచుని వాన చూస్తూ ఉప్మా తింటున్నాను. ఈ వాన....రాత్రంతా కురిసి పగలు వెలవ కూడదూ! మళ్ళా....మళ్ళా అనుకున్నాను. అయినా వాన ఒకరి ఇష్టం గ్రహించి వస్తుందా? ఒకరి కష్టం గ్రహించే స్థితిలో వున్న మనుషులే గ్రహించడానికి ఇష్టపడటం లేదే! ఇంక ప్రకృతి నెవరు శాసించగలరు?

రంగమ్మ పని ముగించుకుని సుశీల ఇచ్చిన వన్నీ మూట కట్టుకుని వెడుతూంది. గుమ్మం దగ్గర కొచ్చాక సుశీల అంది: "రేపు పనిలోకి రావడం మానకు"

"అలాగేనమ్మా, వస్తాను"

"రాత్రి మా వరండాలోకొచ్చి పడుకోండి. ఆ సత్రం దగ్గర చోటులేకపోతే. మీ ఇల్లునేను కోడం ఇప్పుడప్పుడే కుదరదు కదా!"


"అలాగే తల్లీ"

"అయినా, పాడువాన, పనిచేటు. రాత్రొస్తే ఏ పనికీ ఇబ్బంది వుండదు. హాయిగా వుంటుంది. రాత్రొచ్చి పగలు రాకుండా వుండకూడదూ ఈ వాన?" అంది సుశీల.

వెడుతున్నదల్లా ఆగి టక్కున చేతిలో మూట కింద పడేసి చేతులు జోడించి అంది రంగమ్మ:

"అమ్మ, అమ్మ, అంత మాట అనబోకండి. రాత్రేల వాన కురిస్తే బీదోల్లం, ఏడ తొంగుటాం. రాత్రేల వానొస్తే మాచెడ్డ ఇబ్బంది తల్లీ మాకు. యాడకెల్దానికుండదు. చల్లని తల్లి. రాత్రేల ఒన రాకుండా పగలంతా కురియాల. పగలయితే మీ లాంటి మారాజుల ఇళ్ళకాడ పనుల్లో ఉండి పోతాం. పిల్లలూ అంతా అల్ల అల్ల ఇల్లకాడ సద్దుకుంటారు. పగలే ఒన కురియాల తల్లీ, పగలే. రాత్రేల ఒద్దనే ఒద్దు" అంటున్న రంగమ్మ కేసి తెల్లబోయి చూశాను.

కళ్ళ ముందొక మెరుపు. అప్పటిదాకా అర్థం కాని నిజం. అయినా వాన నెవరు శాసిస్తారు? పగలైనా, రాత్రయినా అంతా మనిష్టమేనా?....□




కుమారి యమ్. సావిత్రి

కేరాఫ్ శ్రీ యమ్. వి. సుబ్బారావు, శేఖర్ నగర్, ఏలూరు-534002

వయసు 17 సం. లు. బి. యస్ సి. చదువుతూ ఆపేసి, మెడిసిన్‌లో జేరబోతున్నారు. చిత్రలేఖనం చాలా యిష్టం. సైన్సు విద్యార్థినులతోనూ, కళాకారిణులతోనూ స్నేహాన్ని కోరుతున్నారు. తోట పని చెయ్యడం, వివిధ పుస్తకాల చదువు-హాబీలు.

శ్రీమతి పి. నిర్మలా రవికుమార్

4-16-86 బారక్‌పేట, గుంటూరు-2

25 సం.లు వయసు. బి. ఏ. బి. ఇడి చదివారు. విదేశీయ వనితలతో స్నేహాన్ని కాంక్షిస్తున్నారు. కళల మీదా, కళాకారుల మీదా ఎనలేని అభిమానం. మంచి పుస్తకాలు చదవడంలో ఉత్సాహం చూపుతారు.

కుమారి కె. యన్. సుబ్బలక్ష్మి

డాటర్ ఆఫ్ శ్రీ కె. యన్. యస్. మూర్తి, 4/13 బ్రాడీపేట, గుంటూరు - 2

బాలానందం కేంద్రంలో ఉపాధ్యాయినిగా ఒక పూట పనిచేస్తూ సాయంకాలం కళాశాలలో బి. ఎ. చదువు కుంటున్నారు. రేడియో నాటకాల్లో పాల్గొంటూ వుంటారు. నాట్యం, సంగీతాలలో ఉత్సాహం వున్నది.

కుమారి యమ్. ఇ. లీలాసాగర్

కేరాఫ్ శ్రీ బి. ఆర్. శర్మ (లిప్టన్స్) సోమేశ్వర టాకీస్ దగ్గర, యమ్మిగనూరు, (కర్నూలు జిల్లా)

పదవ తరగతి వరకూ చదివారు; వయసు 16 సం. లు. క్రీడారంగంలో ఎక్కువ ఆసక్తి. చాలా ఆటల్లో ప్రవేశం గలవారు. వాటిల్లో బహుమతులు కూడా పొందారు. విదేశీయ స్టాంపులు సేకరించడం చాలా ఉత్సాహం. ఆ ఉత్సాహంతో 'ఆల్బమ్స్' కూడా తయారుచేశారు.

శ్రీమతి బి. అరుణాదేవి

డాటర్ ఆఫ్ శ్రీ వి. యల్. గౌడ్, ఎమ్. ఎల్. ఎ. నాగర్ కర్నూల్ పోస్ట్ (మహబూబ్‌నగర్ జిల్లా)

వయసు 26 సం. లు. గృహిణి. మంచి స్నేహాన్ని కాంక్షిస్తున్నారు. పుస్తకాలు ఎక్కువగా చదివినా వాస్తవికతకు దగ్గరగావుండే రచనలంటే చాలా ఇష్టపడతారు.

కుమారి ప్రేమ

కేరాఫ్ శ్రీ బి. హెచ్. సుధీంద్రరావు, 'పుష్ప నివాస్' 3వ క్రాస్, గాంధీనగర్, మండ్య (కర్ణాటక)

వయసు 18 సం. లు. బి. కామ్. చదువు కుంటున్నారు. పురుషులవలె స్త్రీలకూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండాలన్న వారిని గౌరవిస్తారు; వారితో స్నేహం కాంక్షిస్తారు. "మంచి స్నేహమే ముఖ్యంగాని, అందులో ఆడ, మగ తారతమ్యాలు చూడను" అంటారు.

శ్రీమతి ఎ. కృష్ణకుమారి

కేరాఫ్ శ్రీ ఎ. కోటేశ్వరరావు, బలుసుమూడి, భీమవరం-2 (ప. గో. జిల్లా)

20 సం. లు. వయసు. గృహిణి. ఎక్కువగా పత్రికలు చదువుతారు. కళాకారులంటే అమితమైన అభిమానం. ఉత్తరాలు రాయడంలో చాలా శ్రద్ధ చూపుతారు.

[వనిత 'స్నేహ పీఠం' ద్వారా స్నేహితులై - వారి వారి అభిరుచుల మీద, వివిధ విషయాల మీద లేఖలు రాసుకుంటున్న మిత్రులు — వారి లేఖలు పాఠకులకు ఉత్సాహకరంగా వుండగలవని అనిపిస్తే మిత్రురాలితో సంప్రతించి, (తొలి నుంచీ వున్న ఇద్దరి ఉత్తరాలనూ) ప్రచురణకు పంపవచ్చును. తగిన స్టాంపులు అతికించిన కవరు కూడా పంపితే, ప్రచురణకాని పక్షంలో-భద్రంగా తిప్పి పంపివేస్తాము. —వ. సం]